క్లుప్తంగా

ఏఐటీయూసీకి రాజీనామా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఏఐటీయూసీ మాజీ ఫిట్ సెక్రెటరీ గొల్లపల్లి రాంచందర్ యూనియన్‌కు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో యూనియన్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు రాంచందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తన రాజీనామాను యూనియన్ బ్రాంచీ కమిటీకి అందజేశారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

దండేపల్లి: సమాజ సేవలో లయన్స్ క్లబ్ సభ్యులు భాగస్వాములు కావాలని లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ మోర భద్రేశ్ అన్నారు. మేదరిపేటలో ఆదివారం లయన్స్ క్లబ్ దండేపల్లి మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భద్రేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కొండు జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం రాంచందర్, కోశాధికారిగా క ల్లెం రాజన్న, ఉపాధ్యక్షులుగా బొలిశెట్టి రాజ న్న, కొండు రామన్నతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కేబినెట్ మెంబర్ మాదంశెట్టి మల్లికార్జున్, మండల మాజీ అధ్యక్షులు సుగుణాకర్, సత్యనారాయణ, జోన్ చైర్మన్లు అంజిత్‌రావ్, సతీష్, సభ్యులు కిషన్, శేఖర్, గంగారాం, శ్రీనివాస్, రామ్ రాజ్, రమేష్, నరేందర్ పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయండి

రామకృష్ణాపూర్: జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి అల్లి రాజేందర్, బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి కోరారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు ప్రవీణ్, సురేష్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీసీ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎస్సార్పీ 3, 3ఏ గని ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. గనిపై ఆదివారం జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచీ కార్యదర్శులు బీ. మారుతి, బద్రి బుచ్చయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఫిట్ కమిటీ చీఫ్ అడ్వైజర్‌గా మధుసూధన్(సీనియర్ అండర్ మేనేజర్), రమేశ్(సీనియర్ అండర్ మేనేజర్), ఫిట్ సెక్రెటరీగా కా రుకూరి నగేశ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా కడసు భీమయ్య, జాయింట్ సెక్రెటరీలుగా డీ.వరమల్లు, టీ.మల్లేశ్, అల్లం సతీశ్, ఎం.అనిరుద్, కోశాధికారి గా సాయి ప్రకాశ్, రిలే ఇన్‌చార్జీలుగా ప్రతాప్‌గౌడ్, సంతోశ్, గొర్రె కార్తిక్, ఆడెపు సురేశ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్, ఆకుల విలాస్, శివ, ఎగ్జిక్యూటీవ్ స భ్యులుగా స్రవంతి, నరేశ్, సారయ్య, అప్పని వేణు, సుక్కరాజు, సుభాశ్, చిరంజీవిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ బీసీ ఉద్యోగుల సమస్యల పరి ష్కారం కోసం పని చేయాలని నేతలు తెలిపారు.

'మోదీ హయాంలోనే దేశం అభివృద్ధి'

దండేపల్లి: మోదీ హయాంలోనే దేశం అన్ని విధాల అభివృద్ధి చెందిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. మోదీ పదకొండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దండేపల్లి మండలం తాళ్లపేటలో ఆదివారం ఇంటింటా తిరిగి, మోదీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు.

వినతిపత్రం అందజేత

లక్సెట్టిపేట: ఓ చానల్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మండలంలోని జర్నలిస్టులు ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సై గోపతి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం పట్టించుకొని, ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు అభినయ్, రమేశ్, శ్రీనివాస్, సత్యనారాయణ, మహేందర్, అనిల్, సంతోష్, మనోజ్, కిరణ్, రాజు, సోక్రటీస్, వినీత్ పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు డాక్టరేట్



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రానికి చెందిన పూస్కూరు శ్రీనివాసరావు శని వారం హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రైతు సమన్వ య సమితి మండల మాజీ కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ శిల్ప భర్త పూస్కూరు శ్రీనివాసరావు నిరుపేద విద్యార్థులను చదివించడం, భూదాన ధర్మాలు చే యడం, ఆర్గానిక్ సేవలు అందించడంతో పాటు ఆయన చేపడుతున్న వివిధ సామాజిక సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని స్ఫూర్తి సొసైటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అందజేశారు. కాగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శ్రీనివాసరావును శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

బురద కష్టాలు!



దండేపల్లి: మండల కేంద్రంలోని పెద్ద పోచమ్మ ఆలయానికి వెళ్లే భక్తుల బురదకష్టాలు అన్నీ ఇన్నీ కావు. నేతకాని వాడ నుంచి ఆలయం వరకు ఉన్న రోడ్డు మొత్తం గుంతలు పడి నీళ్లు నిలిచి బురదమయంగా మారింది. దీంతో బురద రోడ్డుగుండా వెళ్లేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతల్లో మొరం పోయించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఒరిగిన స్తంభం..



నెన్నెల: మండలంలోని జోగాపూర్ శివారు పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు పూర్తిగా ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఒరిగిన స్తంభాలు సరిచేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నీటికుంట కాదిది రోడ్డే...



చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో బ్యాంకు పక్క కాలనీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మురుగుకాల్వలు సక్రమంగా లేవు. దీంతో మురుగునీరంతా రోడ్లపై చేరుతోంది. వర్షాలు కురిస్తే కుంటలా తయారవుతోంది. ఈ దారిగుండా వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పట్టించుకుని మురుగుకాల్వలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గోరింట సంబురం



చేతికి గోరింటాకు అలంకరించుకున్న మహిళలు

పాతమంచిర్యాల/మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రమైన మంచిర్యాల అదిత్య ఎన్‌క్లేవ్‌లో, సురభి గ్రాండ్ హోటల్లో గోరింటాకు సంబురాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంను పురస్కరించుకొని మహిళలు ఆనందోత్సవాల నడుమ వేడుకగా జరుపుకున్నారు.

శ్రీరాములు సేవలు అభినందనీయం

తాండూర్: ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన మాసాడి శ్రీరాములు విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. తాండూర్ మండలం బోరేపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఆదివారం శ్రీరాములు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా తాండూర్ మండల కేంద్రం సురభి గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పలువురు హాజరై పూలమాల వేసి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' వీక్షణ

వేమనపల్లి/భీమారం/జైపూర్: ప్రధామంత్రి మోదీ సందేశాత్మక 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. జైపూర్ మండలం ఇందారంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చేగొండ శ్రీనివాస్ యాదవ్, 106బూత్ అధ్యక్షుడు కొరివి సాయికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి దుర్గం అశోక్, మన్‌కి బాత్ జిల్లా కో కన్వీనర్ పానుగంటి మధు ప్రోగ్రాంను వీక్షించారు. భీమారంలో బీజేపీ నాయకుడు సెగ్యం మల్లేశ్ గృహంలో బీజేపీ జిల్లా నాయకులు మాడెం శ్రీనివాస్, మార్త కుమార్, మండల అధ్యక్షుడు బోర్లకుంట శంకర్ చూశారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయిలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో మన్ కీ బాత్ వీక్షించారు. ఎస్సీ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎరుకల నర్సింగ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా శాలువాతో సత్కరించారు.

బోనమో పోచమ్మ..!



శివసత్తుల పూనకాలు,పోతరాజుల విన్యాసాలు

మంచిర్యాలఅర్బన్/నెన్నెల/భీమిని/నస్పూర్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బోనాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఒడిబియ్యంతో పాటు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ పోచమ్మ, శ్రీలక్ష్మీ నగర్ రోడ్ నంబర్ 2 నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నెన్నెల మండలం మైలారం గ్రామంలో గిరిజనులు బుర్రి పోచమ్మ పసుపు, కుంకుమలతో అలంకరించి ఒక చాటలో పెట్టుకొని బోనాలతో భీమన్న ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు పండాలని, పిల్లాపాపలను సల్లంగా చూడాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దిన్, ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. నస్పూర్ పట్టణ పరిధి సీసీసీ ముక్కిడి పోచమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు ఎత్తుకొని శివసత్తుల పూనకాలతో, పోతరాజుల విన్యాసాలతో షిర్కే చౌరస్తా నుంచి సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.



పోచమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



హమాలీవాడ పోచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గ్రామ దేవతల ఊరేగింపు

నెన్నెల: మండలంలోని దుబ్బగూడెం భీమన్న, లక్ష్మీదేవర గ్రామదేవతలను గిరిజనులు ఆదివారం మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగించారు. డప్పుచప్పుళ్లతో ఇంటింటికీ వెళ్తూ బండారు(పసుపు), బియ్యం సేకరించారు. గంగస్నానానికి బయలుదేరే ముందు గ్రామ దేవతలను ఊరేగిస్తామని పూజారులు తెలిపారు.

ఘనంగా అమ్మవారికి బోనాలు

జన్నారం: మండలంలోని పొనకల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ, పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కంకాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పొనకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.

ఆధ్యాత్మికం

చెన్నూర్‌లో పెద్దమ్మ తల్లి బోనాలు



బోనాలు సమర్పిస్తున్న భక్తులు

చెన్నూర్: పట్టణంలోని ఎమ్మెల్యే కాలనీ, బట్టిగూడెం, పాత బస్టాండ్, కొత్తగూడెం, గెర్రెకాలనీలకు చెందిన ముదిరాజ్ కులస్తులు ఆదివారం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మేకలు, పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయ నిర్వాహకులు గిరెల్లి మల్లయ్య, పందుల మధునక్క, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దమ్మతల్లి బోనాల జాతర

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న బోనాల జాతర ఆదివారంతో ముగిసింది. ఆలయ ఆవరణలో పట్నాలు నిర్వహించారు. అనంతరం గావుపిల్ల కార్యక్రమాన్ని జరిపిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

'మంచిర్యాల'లో 60 డివిజన్లు

- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌లో డివిజన్ల విభజన పూర్తయింది. భౌగోళిక ప్రాంతాలు, ఓటర్ల సంఖ్యను ప్రతిపాదికన తీసుకుని మొత్తం 60 డివిజన్లుగా విభజిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.

డివిజన్ల వారీగా ప్రాంతాలు ఇలా..

1వ డివిజన్: రైల్వే ట్రాక్‌ను ఆనుకొని తోళ్లవాగు, రాజీవ్‌నగర్ హనుమాన్ గుడి రోడ్డు

2వ డివిజన్: నస్పూర్ శివారు నుంచి తాళ్లపల్లి శివారు, ఆర్‌కే 5 కాలనీ, నందన వనం పార్కు రోడ్డు

3వ డివిజన్: తాళ్లపల్లి శివారు నుంచి సింగాపూర్ శివారు, మందమర్రి గోదావరిఖని రోడ్డు, శాంతి స్టేడియం ఎడమ భాగం, సింగరేణి ఫంక్షన్‌హాల్, శివాలయం గుడి

4వ డివిజన్: జాతీయరహదారి 363రోడ్డు వెంట శివాలయం, శాంతి స్టేడియం రోడ్డు, మందమర్రి గోదావరిఖని రోడ్డు, సింగాపూర్ శివారు, హనుమాన్ గుడి మీదుగా ఏ సెక్టార్ క్వార్టర్స్ ముగింపు శివాలయం

5వ డివిజన్: కృష్ణకాలనీ రోడ్డు, హనుమాన్ గుడి, సింగపూర్

6వ డివిజన్: తాళ్లపల్లి నుంచి పోచమ్మ గుడి, చర్చి రోడ్డు, విద్యామందిర్ రోడ్డు

7వ డివిజన్: అంబేద్కర్ గ్రౌండ్ నుంచి సాయిబాబ గుడి, చర్చి వద్ద గల నాలా కుడి భాగం నుంచి ప్రగతి స్టేడియం రోడ్డు ఎడమ వైపు నుంచి ప్రగతి స్టేడియం వరకు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రోడ్డు నుంచి సబ్‌స్టేషన్, విద్యామందిర్ రోడ్డు, బెతెల్ విజన్ చర్చి, అంబేద్కర్ గ్రౌండ్

8వ డివిజన్: సింగపూర్ శివారులోని ప్రగతి స్టేడియం రోడ్డు, సాందీపని స్కూల్, ప్రగతి స్టేడియం రోడ్డు కుడివైపు రోడ్డు

9వ డివిజన్: నలాండ్ జీఎఫ్ఏ చర్చి వద్ద నుంచి గోదావరి నది, తాళ్లపల్లి స్ట్రీమ్, సీతారాంపల్లి శివారు

10వ డివిజన్: నస్పూర్ గేట్ నుంచి సీతారాంపల్లి రోడ్డు పెట్రోల్ బంకు, నస్పూర్ చెరువు, తోళ్లవాగు గోదావరిలో కలిసే చోటు, జిల్లా కలెక్టరేట్ భవనం, నస్పూర్ వాటర్ ట్యాంక్, నస్పూర్ గేట్.

11వ డివిజన్: సాయికుంట నాలా, కై లాస్‌గిరి కాలనీ, బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూం, నస్పూర్ గేట్, కలెక్టరేట్ ప్రహరీ, తోళ్లవాగు మీదుగా గోదావరి నది, రైల్వేట్రాక్ గర్మిళ్ల శివారు మీదుగా సాయికుంట చెరువు

12వ డివిజన్: గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల నుంచి మజీద్ రైల్వే ట్రాక్ ముగింపు, నది బార్డర్, కాలేజీరోడ్డు, గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల

13వ డివిజన్: రాళ్లవాగు నాలా నుంచి బాలాజీనగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీ, హనుమాన్ గుడి, రాళ్లవాగు ముగింపు, ఎన్టీఆర్ నగర్ నాలా వరకు.

14వ డివిజన్: మంచిర్యాల శివారు నుంచి రాళ్లవాగు బ్రిడ్జి, గోదావరి నది, మంచిర్యాల శివారు జాతీయ రహదారి 63రోడ్డు ముగింపు.

15వ డివిజన్: కొత్తపల్లి శివారు వేంపల్లి నుంచి మంచిర్యాల శివారు శాలివాహన ప్లాంటు రోడ్డు, అక్కడి నుంచి పాతమంచిర్యాల సబ్‌స్టేషన్ వరకు, వేంపల్లి శివారు నుంచి గోదావరి నది, కొత్తపల్లి శివారు వరకు.

16వ డివిజన్: ముల్కల్ల శివారు మీదుగా రాళ్లవాగు రోడ్డు నుంచి పోచంపాడ్ శివారు మీదుగా, ముల్కల్ల గోదావరి నది ముగింపు వరకు.

17వ డివిజన్: గుడిపేట నుంచి బెటాలియన్ మీదుగా గోదావరి నది వరకు, గుడిపేట నంనూరు, చందనాపూర్ గ్రామాల వరకు

18వ డివిజన్: గుడిపేట రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 295నుంచి రాళ్లవాగు మీదుగా కొత్తపల్లి, పోచంపాడ్, వేంపల్లి గ్రామాలను కలుపుతూ గుడిపేట 13వ బెటాలియన్ చర్చి వరకు.

19వ డివిజన్: మంచిర్యాల హిల్స్ నుంచి రాళ్లవాగు మీదుగా పాతమంచిర్యాల బ్రిడ్జి జాతీయ రహదారి వరకు, పాతమంచిర్యాల సాయిబాబ ఆలయం వెనకవైపు నుంచి శాలివాహన పవర్ ప్రాజెక్టు వరకు.

20వ డివిజన్: రాళ్లవాగు నుంచి ఆర్‌ఆర్ కాలనీ రోడ్డు నంబర్ 2, కల్వరి చర్చి, శ్రీనివాస గార్డెన్ కమాన్ మీదుగా రైల్వే ట్రాక్ వరకు, అక్కడి నుంచి ఎంసీసీ ఫ్యాక్టరీ కంపౌండ్ వాల్ మీదుగా జాతీయరహదారి 363మీదుగా అల్ఫోర్స్ కాలేజీ నుంచి రాళ్లవాగు వరకు, అక్కడి నుంచి కార్మెల్ హైస్కూల్ బ్రిడ్జి నుంచి రాళ్లవాగు వరకు.

మరిన్ని డివిజన్ల వివరాలు రేపటి సంచికలో...

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

రామకృష్ణాపూర్: మంచిర్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మునీర్ స్మారకార్థం రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, పట్టణ ఎస్సై రాజశేఖర్ శిబిరాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన రెనే ఆసుపత్రి, మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో రక్తపరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేయిమందికి పైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకుడు పుల్లూరి సుధాకర్, ఆయా పార్టీల నాయకులు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్,రామడుగు లక్ష్మణ్, సీనియర్ అడ్వకేట్ సంధాని తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

ఉచిత వైద్య శిబిరం

నస్పూర్: జిల్లా కేంద్రంలోని వసుధ ఆసుపత్రి ఆధ్వర్యంలో సంఘం మల్లయ్యపల్లెలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మామిడి నర్సింహ, వైద్యులు వేణుగోపాల్‌రావు, వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూర్ కాపు కమిటీ ఎన్నిక

రామకృష్ణాపూర్: పట్టణ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని ఆదివారం స్థానిక భీమా గార్డెన్స్ లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా గాండ్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా అలుగుల సత్తయ్య, గౌరవాధ్యక్షుడిగా రామిడి కుమార్, ముఖ్య సలహాదారుడిగా పల్లెరాజు, సలహాదారులుగా కోల శ్రీనివాస్, భీమయ్య, ఉపాధ్యక్షులుగా ఆత్మకూరి మహేందర్, సుధాకర్, సత్తయ్య, సత్యనారాయణ, కార్యదర్శులుగా చంద్రమౌళి, క్రాంతి, రాజయ్య, రవి, సహాయ కార్యదర్శులుగా నారాయణ, శామంతుల రాజన్న, రామిడి రాజన్న, లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా నరెడ్ల వెంకన్న, ఈసీ మెంబర్‌గా పడాల నర్సయ్యలను ఎన్నుకున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నీరు వెళ్లే దారేది..!



భీమారం: మండలంలోని ఎలకేశ్వరంలో డ్రెయినేజీలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే సీసీ రోడ్డుపై వరద నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

సంబంధిత అధికారి : సతీష్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి ఫోన్ నంబర్ : 9848384636

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో ఆదివారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సాంబమూర్తి, ఈ.మారయ్య తెలిపారు. పోటీలకు 150మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 20మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వీరు జూలై 6న హన్మకొండలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



రన్నింగ్ రేస్‌లో పాల్గొన్న క్రీడాకారులు

లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల గోల్డెన్ జూబ్లీ ఎన్నికలు

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల గోల్డెన్‌జూబ్లీ థర్డ్ ఇన్‌స్టాలేషన్ 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కూరపాటి కిరణ్‌కుమార్, సెక్రెటరీగా ఇరుకుల్ల శివప్రసాద్ గుప్తా, ట్రెజరర్‌గా సద్దనపు చందర్ ఎన్నిక కాగా, పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ 320జి డిస్ట్రిక్ట్ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, ట్రెజరర్ ఇరుకుల్ల ఆనంద్, రీజియన్ చైర్‌పర్సన్ ఉప్పెమల్ల రాజేంద్రప్రసాద్, జోన్ చైర్‌పర్సన్లు మోదపురం వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, సుగుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ కూరపాటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ద్వారా చేస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా సీపీఆర్, ఆర్గాన్ డొనేషన్‌పై అవగాహన పెంచడం, నేత్ర దానం, రక్తదానం, డయాబెటిక్ వ్యాధుల వారికి హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: మా భూమి రథ యాత్రను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ జిల్లా నాయకులు రామస్వామి అన్నా రు. జిల్లా కేంద్రంలో ఆదివారం 'మా భూమి రథయాత్ర' పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మా భూమి రథ యాత్ర ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అన్నెల లక్ష్మణ్, నాయకులు నందిపాటి రాజు, రేగుంగ రాకేష్, తాళ్లపల్లి చంద్రశేఖర్, గొడిశెల సురేందర్ పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మందమర్రిరూరల్: పట్టణంలోని కార్మెల్ హై స్కూల్లో 2000-01వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానం చేశారు.